క్లుప్తంగా

సేవలు అభినందనీయం



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

అనపర్తి: ఐటీసీ సహకారంతో ప్రథమ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి డిజిటల్ మేళాను హెచ్ఎం ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు ద్వారా విద్యాభివృద్ధికి ప్రథమ్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. హెచ్ఎం ప్రసాద్, రామవరం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు సత్తిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ మేళా ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక పెరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులను ప్రజాప్రతినిధులు చూసి అభినందించారు. ఎంపీటీసీ సభ్యులు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నల్లమిల్లి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

గోకవరం: స్థానిక రమాసత్యనారాయణ స్వామి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నదానం జరిగింది. ఆలయంలోని ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అన్నదానం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

బిక్కవోలు: మండలంలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కెమికల్ డివిజన్ విస్తరణకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దీనిపై ప్రజలకు అవగాహన కల్పించిన తర్వాతే అభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు.

రంగస్థల నటుడు మృతి



సత్తి ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

బిక్కవోలు: కొంకుదురుకు చెందిన సీనియర్ రంగస్థల నటుడు, సినీ నటుడు సత్తి ప్రసాద్‌రెడ్డి (61) అనారోగ్యంతో పందలపాకలో బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా కొంకుదురు వెంకటరమణ ఆర్ట్స్ అధినేత చిన్నం వెంకట నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రసాద్‌రెడ్డి మృతి రంగ స్థలానికి తీరని లోటు అన్నారు. అనంతరం వెంకటరమణ ఆర్ట్స్ సభ్యులు సంతాపం తెలిపారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు పందలపాక ఉన్నత పాఠశాల 2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పేకాట శిబిరంపై దాడి

సీతానగరం: గ్రామంలోని వెలమపేట రామాలయం వద్ద పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ.13,800 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

సర్వే రాళ్లు పక్కాగా అమర్చాలి



పడమర ఖండ్రికలో సర్వే రాళ్ల అమరికను పరిశీలిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: ప్రమాణాల ఆధారంగా క్షేత్ర స్థాయిలోని వ్యవసాయ క్షేత్రాల్లో సర్వే రాళ్లను పక్కాగా అమర్చాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. పడమర ఖండ్రికలో బుధవారం చేపట్టిన సర్వే రాళ్ల అమరిక కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. రికార్డులు, క్షేత్ర స్థాయి భౌగోళిక పరిస్థితులను ఆమె పరిశీలించారు. రీసర్వే తీరుపై సంబంధిత అధికారులతో చర్చించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, రీసర్వే డీటీ శ్రీరామ్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వాకతిప్ప లేఅవుట్ పరిశీలన

వాకతిప్పలోని లేఅవుట్‌ను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పరిశీలించారు. త్వరితగతిన జగనన్న కాలనీలను అభివృద్ధి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని వారన్నారు.

రూ. 215 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం

- నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు గోదావరి జలాలు
- సీఎం జగన్‌కు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వినతి



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

రాజానగరం: నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా గోదావరి జలాలను అందించాలనే సంకల్పాన్ని సాకారం చేసుకోవడంలో భాగంగా వాటర్ గ్రిడ్ పథకాన్ని మంజూరు చేయాలని సీఎం జగన్‌కు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. బుధవారం తాడేపల్లిలో సీఎంని కలిసిన ఆయన ఇందుకు అవసరమైన రూ. 215 కోట్లను కేటాయించాలని కోరారు. గోదావరికి అత్యంత చేరువలోనే ఉన్నాగానీ నియోజకవర్గంలో అనేక గ్రామాల ప్రజలు బోరునీటితోనే తమ దాహార్తిని తీర్చుకోవాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఇప్పటికే రూ. 65 కోట్లతో పైపులైన్లు వేసే పనులు చేపట్టారన్నారు. వాటర్ గ్రిడ్ పథకం అమలు ద్వారానే సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు. సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల సామర్థ్యంతో కూడిన హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. కోరుకొండ మండలంలో భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో నెలకొన్న సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గాదరాడ, నరసాపురం, కణుపూరు, రాజవరంలోని సుమారు 4 వేల ఎకరాలకు సాగునీటి అందించేలా ఎత్తిపోతల పథకాన్ని కూడా మంజూరు చేయాలని సీఎంకి విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోరుకొండ మండలం శ్రీరంగపట్నానికి చెందిన 11 మంది కళాకారుల కుటుంబాలకు త్వరితగతిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు రాజమహేంద్రవరం పేపరు మిల్లు కార్మికులకు కూడా న్యాయం చేయాలన్నారు. ఈ మేరకు తాను చేసిన పైవిన్నపాలపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే జక్కంపూడి తెలిపారు.

ప్రకృతి విధానాలతో నేలను కాపాడుకోవాలి



కడియంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, రైతులు, సిబ్బంది

కడియం: ప్రకృతి సాగు విధానాలతో నేల తల్లిని కాపాడుకోవాలని పలువురు కోరారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కడియంలో ప్రకృతి సాగు విధానాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ అనంతరం, దేవీచౌక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. సాగులో 30 రకాల విత్తనాలను వినియోగించడం ద్వారా నేలను సారవంతం చేసుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. నేల తన స్వాభావిక గుణాన్ని కోల్పోతే భవిష్యత్తులో పంటలు పండవని తెలిపారు.

25న జాబ్‌మేళా

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెలకు రూ.10 వేల వరకు వేతనం, ఇంటెన్సివ్‌లు ఉంటాయన్నారు. ఆసక్తి కలవారు ఆరోజు ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 94940 89595 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్వయం సంరక్షణపై అవగాహన



సంరక్షణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: రాధేయపాలెంలోని హెల్త్ క్లినిక్‌లో కుష్ఠు, బోద వ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణ పద్ధతులపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. బ్రైట్ ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో రీచ్ మీ ప్రాజెక్టు, పాలచర్ల పీహెచ్‌సీలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. డాక్టర్ బెనెరెడ్డి, రీచ్ మీ ప్రాజెక్టు జిల్లా కో ఆర్డినేటర్ ఎం.రంగనాథరావు స్వయం సంరక్షణ పద్ధతుల గురించి వివరించి, అందుకు అవసరమైన కిట్లను అందజేశారు. హెల్త్ సూపర్ వైజర్ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, ఏఎన్ఎం శకుంతల, హెల్త్ అసిస్టెంట్ పుల్లారావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

మధురపూడి: కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరానికి గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శారదా సతీష్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీ చేస్తుండగా కోరుకొండ శివారులోని రోమ్‌సిటీ వద్ద మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులను గుర్తించారు. వారిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. రాజమహేంద్రవరంలోని సుబ్బారావు నగర్‌కు చెందిన బుర్తి పవన్ కుమార్, వల్లూరి రాజేష్‌గా గుర్తించారు. వారి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఇటీవల మధురపూడి – గాడాల సమీపంలో బైక్‌పై వెళుతున్న దంపతులను గాయపరిచి, వారి సెల్‌ఫోన్ అపహరించిన దుండగులు వీరేనని విచారణలో తెలిసింది.

మమ్మేలు కనకదుర్గమ్మ



బిక్కవోలులో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న రామకృష్ణంరాజు దంపతులు



తొస్సిపూడిలో కనకదుర్గమ్మ

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలో కనకదుర్గమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. అనంతరం అమ్మవారి జాతర, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. మాజీ సర్పంచ్ తేతలి జగ్గిరెడ్డి, ఉప సర్పంచ్ దార్వంపూడి వీర వెంకట రామారెడ్డి (తంబి), మల్లిడి ఈశ్వర్‌రెడ్డి, నాయకుడు మేడపాటి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను విద్యుత్ శాఖ ఏపీ జనరల్ మేనేజర్ కనక వెంకట రామకృష్ణంరాజు, సాంబ లక్ష్మీదేవి దంపతులు దర్శించుకున్నారు. స్థానిక లక్ష్మీగణపతి, కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం వారికి మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి జ్ఞాపిక అందించారు. ఆలయ ఈఓ రామలింగభాస్కర్, తమ్మిరెడ్డి నాగశ్రీనువాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న శ్రీదేవి కనకదుర్గమ్మ తీర్థం

రంగంపేట: చంద్రేడులో కొలువైన శ్రీదేవి కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక తీర్థ మహోత్సవం ఈ నెల 26న రాత్రి నిర్వహించడానికి గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్తు దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. తీర్థం రోజున ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయి. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగునున్నాయి.


అవగాహనతో టీబీ నివారణ



రంగంపేటలో టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

రంగంపేట: ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా టీబీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మి, లావణ్య తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 23 వరకూ టీబీ వ్యాధి నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. టీబీ సోకిన రోగి తుమ్మినా, దగ్గినా, వచ్చే తుంపర్ల ద్వారా ఇతరులకు సోకుతుందన్నారు. టీబీ వచ్చిన వారికి విపరీతమైన దగ్గుతో పాటు జ్వరం, ఛాతిలో నొప్పి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం, ప్రధానంగా సాయంత్రం కాగానే చలి, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. అశ్రద్ధ చేయకుండా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకుని తగిన మందులు వాడాలని అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ జయమణి, ఎంపీహెచ్ఈఓ శంకర్, పీహెచ్ఎన్ గంగా భవాని, ఎంపీహెచ్ఎస్ (ఎం) రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా మహా రుద్రయాగం



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



మహా రుద్రయాగాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

నేటితో ముగియనున్న క్రతువు

రాయవరం: సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 12న ప్రారంభమైన పంచాయతన మహా రుద్రయాగం గురువారంతో ముగియనుంది. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో వింజమూరి శ్రీరామ సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, కందర్ప కామేశ్వరశర్మ, వింజమూరి వీరభద్రం, పెద్దింటి శేషాచార్యుల సమక్షంలో 100 మంది వేద పండితులు నిర్విఘ్నంగా మహా రుద్రయాగాన్ని నిర్వహించారు. రోజూ మహన్యాస పూర్వక రుద్ర జపాభిషేకాలు, సూర్య నమస్కారాలు, సూర్య మంత్రానుష్టానం, చండీ సప్తశతీ పారాయణం, మంత్రానుష్టానం, గణపతి, విష్ణు మంత్రానుష్టానాలు, అర్చనలు, చండీ సప్తశతీ హోమం తదితర పూజాధికాలు నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత నిర్వహించిన రుద్రయాగాన్ని ఇదే నెలలో 12న ప్రారంభించడం విశేషంగా చెప్పవచ్చు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన భక్తులు కమిటీగా ఏర్పడి నిర్వహించిన మహా రుద్రయాగంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సోమేశ్వరం, పరిసర గ్రామాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దినకర్మకు వెళ్లి వస్తూ కానరాని లోకానికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- ఇద్దరూ సీతానగరం మండల వాసులు



మొయ్యేటి నాని మృతదేహం

కొవ్వూరు: పట్టణ శివార్లలో బుధవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన మొయ్యేటి నాని (30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో సీతానగరంలోని కొత్తపేటకు చెందిన జొన్నకూటి ప్రసన్నకుమార్ అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వారిద్దరూ తాళ్లపూడి మండలం బల్లిపాడులో బుధవారం జరిగిన ఓ దినకర్మకు హాజరై, మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కొవ్వూరు పట్టణ శివార్లలో వారు లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న మొయ్యేటి నాని తలకు బలమైన గాయం కావడంతో, తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న ప్రసన్నకుమార్ తలకు బలమైన గాయం కావడంతో అతడిని 108లో తొలుత కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, తర్వాత కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. నాని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు అవకాశం

కాజులూరు: ఇంటర్ విద్యాభ్యాసం మధ్యలో మానేసిన విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యా మండలి సార్వత్రిక విద్యా విధానం ద్వారా ఇంటర్‌లో చేరేందుకు ప్రత్యేక అవకాశం కల్పించిందని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓపెన్ ఇంటర్‌లో చేరాలనుకునే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజినల్ పదో తరగతి మార్కుల లిస్టు, రిజిస్ట్రేషన్ నిమిత్తం మొబైల్ ఫోన్‌తో ఈ నెల 27వ తేదీ లోగా కళాశాలలో సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. చేరిన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

ప్రకాశం నగర్: పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని లయన్స్ మాజీ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం, స్వర్ణాంధ్ర సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పుష్కర ఘాట్ నిర్వహిస్తున్న అన్నదానం బుధవారంతో 500వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి గ్రంధి వెంకటేశ్వరావు, వీబీ రాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, రోజుకు సుమారు 500 మందికి అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. దీనికి నగరంలోని దాతలు, లయన్స్ సభ్యులు సహకరించాలని కోరారు. నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ నగరంలోని నిరాశ్రయులు, వృద్ధులు, అనాథల కోసం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 1,64,540 మందికి అన్నదానం చేశామని, సుమారు 5 వేల మంది వలంటీర్లు సేవలందించారన్నారు. హైకోర్టు న్యాయవాది రంగరాజన్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ మాజీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కొల్లూరి గోపాలకృష్ణ, హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధి అనూప్ జైన్ పాల్గొన్నారు.

ఆహారం బాగు..

- మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం
- వారంలో మూడుసార్లు రాగి జావ
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అనపర్తిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

అనపర్తి: కార్పొరేట్‌ను తలదన్నేలా సర్కారు బడులు రూపుదిద్దుకున్నాయి.. సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'నాడు–నేడు' పథకం ద్వారా బడుల్లో అన్ని వసతులూ ఒనగూరాయి.. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెంచే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. దీనికితోడు విద్యార్థుల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్న భోజన పథకంలోనూ అనేక మార్పులు చేస్తోంది.. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో మరింత మెరుగైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వారంలో మూడు రోజులు రాగి జావ అందించేందుకు చర్యలు చేపట్టారు. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల పరిధిలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 13,940 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. అనపర్తిలో 3,680, బిక్కవోలులో 3,460, పెదపూడిలో 3,200, రంగంపేటలో 3,600 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు


రుచి.. శుచిగా..

విద్యార్థులంతా మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తినేలా ప్రభుత్వం మెనూలో మార్పులు చేసింది. పోషకాలతో కూడిన రుచి, శుచికరమైన ఆహారం అందించే లక్ష్యంతో మెనూను తీర్చిదిద్దింది. ప్రతి రోజూ ఒకే రకమైన భోజనం కాకుండా రోజుకో రకమైన నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో కాల్షియం, ఐరన్ లోపాలు అధిగమించేందుకు గాను వారంలో మూడు రోజులు రాగి జావ అందించేందుకు నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 2 నుంచి మధ్యాహ్న భోజనంలో రాగి జావ అందించనున్నారు.

మెనూ ఇలా...

జగనన్న గోరుముద్ద పథకంలో రోజువారీ మెనూ చూస్తే.. సోమవారం నుంచి శుక్రవారం వరకూ రోజూ ఉడికించిన గుడ్డు, రోజు విడిచి రోజు చిక్కీ అందిస్తున్నారు. సోమవారం పొంగల్, ఉడికించిన గుడ్డు/వెజ్ పలావ్‌తో ఎగ్ కర్రీ, వేరుశనగ చిక్కీ ఇస్తారు. మంగళవారం దొండకాయ చెట్నీ, పులిహోర, ఉడికించిన గుడ్డు, రాగి జావ, బుధవారం కూరగాయలతో అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ, గురువారం సాంబార్ బాత్/టమాటా చెట్నీతో లెమన్ రైస్, ఉడికించిన గుడ్డు, రాగి జావ, శుక్రవారం అన్నం, ఆకు కూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, శనివారం ఆకు కూరతో అన్నం, రాగి జావ ఉంటుంది.


పటిష్టంగా అమలు



జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పటిష్టంగా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు పర్యవేక్షణను పెంచాం.

– కె.స్వామి నాయక్, ఎంఈఓ, అనపర్తి

రాగి జావతో ఆరోగ్యం



అత్యంత ఆరోగ్యకరమైన తృణ ధాన్యాలలో రాగులు ఒకటి. ఎన్నో రకాల పోషకాలు కలిగిన రాగి జావతో ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులకు రాగి జావ అందించడంతో ఆరోగ్యంగా ఉంటారు. తద్వారా బాగా చదువుకుంటారు.

– పులగం వెంకటరెడ్డి, హెచ్ఎం, కేఏఆర్ జెడ్పీ హైస్కూల్, అనపర్తి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

మధురపూడి: ఉద్యానవనాల పెంపకంలో యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చని పెద్దాపురానికి పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ప్రకాశ్ అన్నారు. మధురపూడిలో బుధవారం పామాయిల్ తోటల రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ మొక్కల పెంపకంలో డిప్ ఇరిగేషన్ పద్ధతులు అవలంబించడం ద్వారా తోటల విస్తృతికి దోహదపడుతుందన్నారు. తెగుళ్ల నిర్మూలన, సస్యరక్షణ ద్వారా పామాయిల్ గెలల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి రినీ మాట్లాడుతూ పామాయిల్ తోటలో అంతర్ పంటల సాగు చేసుకోవచ్చన్నారు. దీనిద్వారా రెండు విధాలుగా ఆదాయం పొందడానికి అవకాశం ఉందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మధురపూడి: దోసకాయలపల్లికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల పట్టిసీమలో తీర్థానికి వెళ్లి గోదావరిలో స్నానం చేస్తూ మృతి విషయం తెలిసిందే. ఆ కుటుంబాలకు జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ బుధవారం రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

వీఎస్ఎంలో 'సైన్స్ ఫ్యూజన్'

రామచంద్రపురం: స్థానిక వీఎస్ఎం అటానమస్ కళాశాలలో ఈ నెల 27, 28 తేదీలలో సైన్స్ ఫ్యూజన్ నిర్వహించనున్నట్లు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సైన్స్ ఫ్యూజన్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నంబర్ థియరీ ఇన్ డైలీ లైఫ్‌పై పోస్టర్ ప్రజెంటేషన్, సైన్స్ ప్రాజెక్టులు, పీపీటీ ప్రజెంటేషన్ వంటి విభాగాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో వేసవిలో తాగునీరు ఎద్దడి తలెత్తకుండా గ్రామ సచివాలయ కార్యదర్శులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బుధవారం సచివాలయ కార్యదర్శులు, ఇతర అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ అంత్యోదయ అప్‌లోడింగ్, స్వామిత్వ రీసర్వే, పన్నులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు తదితర వాటిపై గ్రామాల వారీగా సమీక్షించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కార్యక్రమాలన్నీ నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు.

ఉత్సవాలకు రాట ముహూర్తం

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామచంద్రరావు, ఈఓ రామలింగం పర్యవేక్షణలో అర్చకుడు సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాస్ పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, బోర్డు సభ్యులు, అంగర పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.